చెన్నకేశవుడి ఉత్సవాలు చూద్దాం రండి

- 20 నుంచి తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగనున్న వేడుకలు
- 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయం


చెన్నకేశవ స్వామి ఆలయం, (ఇన్‌సెట్) గర్భగుడిలోని చెన్నకేశవ స్వామి మూల విరాట్

అవుకు: అవుకు పట్టణంలోని కోటలో వెలసిన శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా నిత్యం పూజలు అందుకుంటున్నారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి రాజవంశీయుల ఇంటి వద్దకు అక్కడి నుంచి తేరువీధి, రాజవీధి మీదుగా మండపం వీధి వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. మే 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ సిబ్బంది, గ్రామస్తులు సర్వసిద్ధం చేస్తున్నారు. 20వ తేదీన రాత్రికి సంకల్పం, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశస్థాపనాదులు జరుగుతాయి. 21న వైశాఖ శుద్ధ త్రయోదశి వేకువ జామున చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దంపతులు తలంబ్రాల బియ్యము, వస్త్రములు, మాంగల్యం సమర్పించి ఉభయదారులుగా వ్యవహరిస్తారు. భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి ఉత్సవమూర్తులను హనుమంతు వాహనంపై, 22వ తేదీ వైశాఖ శుద్ధ చతుర్దశి రాత్రి సింహవాహనంపై, 23వ తేదీ వైశాఖ శుద్ధ పౌర్ణమి రాత్రి శేషవాహనంపై ఊరేగుతారు. అదేవిధంగా 24వ తేదీ వైశాఖ బహుళ పాడ్యమి బ్రాహ్మణ సంతర్పణ జరిపి, రాత్రి గరుడ వాహనంపై, 25వ తేదీన వైశాఖ బహుళ విదియ గజవాహనంపై ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తేరువీధి, రాజావీధి మీదుగా మండపం వీధి వరకు, తిరిగి అక్కడి నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. 26, 27వ తేదీల్లో ఘనంగా రథోత్సవం జరుగుతుంది. 28 వ తేదీన తీర్థవాది, ధ్వజారోహణం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. అలాగే 24వ తేదీ రాత్రి, రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు అవుకు రైతుసంఘం పెద్దలు తెలిపారు.

ఆలయ చరిత్ర

16 శతాబ్దంలో నంద్యాల సంస్థానాన్ని పరిపాలించే నంద్యాల చిన్న కృష్ణమ రాజు అవుకులో ఉన్న మట్టి కోటను తొలగించి రాతికట్టడంతో కోటను నిర్మించారు. ఆ సమయంలోనే ఒకనాటి రాత్రి కలలో చెన్నకేశవస్వామి దర్శనమిచ్చి అవుకు కోటలో తనకు ఆలయాన్ని నిర్మించాలని కోరినట్లు నానుడి. ప్రస్తుత వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం తలమంచిపట్నం గ్రామంలోని ఓ రాయితో తన విగ్రహాన్ని తయారుచేసి ప్రతిష్ఠించాలని స్వామివారే స్వయంగా చెప్పినట్లు పూర్వీకుల కథనం. ఈ మేరకు చిన్న కృష్ణమరాజు తన పరివారంతో వెళ్లి రాతిని గుర్తించి స్వామివారి విగ్రహాన్ని తయారు చేయించారు. అనంతరం అవుకు కోటలో ప్రతిష్ఠించడంతోపాటు ఆలయాన్ని నిర్మించారు. స్వామివారికి దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకులకు, ఆలయ నౌకర్లకు కొన్ని ఎకరాల మాన్యాన్ని దానదత్తం చేశారు. శ్రీభూలక్ష్మీ, లక్ష్మీదేవి, చెన్నకేశవ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పంచలోహాలతో దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎత్తైన విగ్రహాలను తయారు చేయించారు.


స్వామివారి ఆలయ ముఖద్వారం

బెస్తలతోనే పల్లకీ సేవ..

16వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం జరిగిన తరువాత శ్రీ భూలక్ష్మీ, లక్ష్మీదేవి, చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తుల పల్లకీని బోయలు చేసేవారని, అప్పట్లో ఏదో కారణాల చేత బోయల నుంచి బెస్తలకు స్వామివార్ల పల్లకీని మోసే ఏర్పాటు చేసారని పూర్వీకుల మాట. ప్రతి పర్వదినాన స్వామివార్ల పల్లకీని అవుకు బెస్తలే మోసేలా తీర్మానం చేశారు. పల్లకీని మోస్తున్నందుకు నంద్యాల నల్లతిమ్మరాజు అవుకులో తవ్వించిన చెరువులో బెస్తలు చేపలు పట్టుకొని జీవనం సాగించేందుకు నంద్యాల వీరరాఘవరాజు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. దీని కొరకు 1922 జూన్ 21న అప్పటి నంద్యాల సంస్థానానికి కలెక్టర్ కార్యాలయంగా ఉన్న బళ్లారి కలెక్టర్ నుంచి అధికారికంగా ఆదేశాలు తీసుకొచ్చారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి పర్వదినాన స్వామివార్ల ఉత్సవ మూర్తుల పల్లకీ సేవను బెస్తలే నిర్వహిస్తున్నారు.


గరుడ వాహనంపై శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి (ఫైల్)

ఐదో ఏడాది లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలకు బ్రేక్


నిర్మాణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల ఏలుబడిలో కొలిమిగుండ్ల కొండపై నిర్మించిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వరుసగా ఐదోఏడాది బ్రేక్ పడింది. పూర్వం నుంచి ప్రతి ఏటా వైశాఖ మాసం(మే)లో వారం రోజుల పాటు స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. రథోత్సవానికి చక్రాలు సరిగా లేక పోవడంతో 2018లో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దనరెడ్డి స్వంత నిధులతో చక్రాలు వేయించారు. ఆ ఏడాది ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. అయితే రథానికి ఏర్పాటు చేసిన చక్రాలు ఒక్కసారికే దెబ్బతిన్నాయి. 2019లో ఉత్సవాల నిర్వహణకు చక్రాలు సరిగా లేని కారణంగా ఆలయ కమిటీ సభ్యులు వాయిదా వేశారు. 2020, 21లో కరోనా కారణంగా స్వామి ఉత్సవాలకు ఆటంకం ఏర్పడింది. 2022లో దాతల సహకారంతో ఐరన్‌తో చక్రాలు ఏర్పాటు చేయించారు. అదే ఏడాది రామ్‌కో సిమెంట్ యాజమాన్యం రూ.7కోట్లతో ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు జీర్ణోద్ధరణ పనులు మొదలు పెట్టింది. ఇప్పటికే గర్భగుడి, ఆలయం చుట్టూ పటిష్టమైన ప్రహరీ నిర్మాణం తదితర పనులు పూర్తి అయ్యాయి. ఐదు అంతస్తుల గాలి గోపురం, మెట్ల పనులు ప్రారంభించారు. ఇతర ప్రాంతాల నుంచి శిల్పకళాకారులను తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. కూలీలు, కళాకారుల సమస్యతో తరచూ పనులకు అంతరాయం ఏర్పడుతుంది. ఈఏడాది మే నాటికి ప్రధానమైన పనులు పూర్తి చేసి ఉత్సవాలను నిర్వహించాలని భావించారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి కావడంతో ఐదోసారి ఉత్సవాలకు బ్రేక్ పడ్డాయి. దీంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు, చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు వస్తుండేవారు. ప్రస్తుతం ఆలయంలో పనులు జరుగుతుండటంతో విగ్రహాలను సైతం పక్కన పెట్టడంతో ఐదేళ్లుగా నిత్య పూజలు లేకుండా పోయాయి. భక్తులకు స్వామిని దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఆలయంలో త్వరగా నిత్య పూజలు జరిగేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి సంప్రోక్షణ, ఉదకశాంతి, వాసుదేవ పుణ్యాహవచనం, నారాయణ హోమం, పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, విష్ణు అష్టోత్తర శతనామావళి, మంత్రపుష్పం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి కోట తిరునాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు పేట తిరునాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.


పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు

మగ శిశువును గుర్తించి తీసుకెళ్లండి

కర్నూలు(అర్బన్)/డోన్ టౌన్: : ఈ నెల 12వ తేదీన నంద్యాల జిల్లా డోన్ రైల్వేగేట్ సమీపంలో లభ్యమైన మగ శిశువును గుర్తించి తీసుకెళ్లాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మ కోరారు. రైల్వేగేట్ సమీపంలో లభించిన శిశువును అక్కడి సీడీపీఓ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్ డోన్ అర్బన్ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించి బాబును ఈ నెల 15వ తేదీన స్వాధీనం చేసుకొని కర్నూలు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు తీసుకువచ్చారన్నారు. కర్నూలు బాలల సంక్షేమ కమిటీ ఉత్తర్వుల మేరకు శిశువును ప్రస్తుతం స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహంలో ఉంచడం జరిగిందన్నారు. ఈ శిశువుకు సంబంధించిన తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే తమ వద్ద ఉన్న ఆధారాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేదా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను కలిసి బాలుడిని తీసుకుపోవాలన్నారు. ఎవరు రాని పక్షంలో 30 రోజుల అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు అనాథగా తీర్మానించి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల మేరకు దత్తత ఇస్తామన్నారు.


డోన్ రైల్వే గేట్ సమీపంలో లభ్యమైన శిశువు

ఏమన్నా...ఎలాగుంది మూమెంట్!

- ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ

కొలిమిగుండ్ల: ఎన్నికల ముగిసి ఐదు రోజులు గడిచిపోయాయి. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కలిస్తే.. ఏమన్నా... ఎలాగుంది మూమెంట్.. అంటూ పలుకరిస్తున్నారు. టీ దుకాణాలు, హోటళ్లు, రచ్చబండల వద్ద ఎక్కడ చూసినా రాజకీయ విశ్లేషణలే కనిపిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఎవరు సీఎం అవుతారు అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఏ ఊర్లో పోలింగ్ ఎలా సాగింది... ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది... ఎవరు గెలుస్తారు.. అనే మాటలే వినిపిస్తున్నాయి. టీషాపుల వద్ద దిన పత్రికలు తిరగేస్తూ జనాలు గంటల తరబడి చర్చించుకుంటున్నారు. ఆ చర్చల్లోనూ ఎవరూ స్పష్టంగా తేల్చడం లేదు.... ఏమంటే ఏ పరిస్థితి ఉంటుందననే... అలా దాటవేతలు సాగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లోనూ ఇదే చర్చ సాగుతోంది. ముఖపరిచయం లేకున్నా... ఎన్నికలపై ఆరా తీస్తున్నాడు సామాన్యుడు. జనం నాడీ మాత్రం అంత సులభంగా బయటకు వెల్లడి కావడం లేదు.

భారీ వర్షం... రైతన్న హర్షం


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం పడింది. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వర్షం కురిసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఈ వర్షాలు ఖరీఫ్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కుందూనదికి జలకళ

పట్టణ శివారులోని కుందూనదిలో నీరు పుష్కలంగా చేరింది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో వర్షపునీరంతా కుందూలో చేరింది. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా సీజన్‌కు ముందుగానే కుందూనది నీటితో ప్రవహిస్తుండటంతో నదీతీర గ్రామాల రైతులు ఊరట చెందుతున్నారు. ఖరీఫ్‌లో వివిధ పంటలు వేసేందుకు సాగునీరు అందుబాటులో ఉండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లె : మండలంలో శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పసులప, చిన్నరాజుపాళెం, పెద్దరాజుపాళెం తండా ప్రాంతాల్లో పొలాలు జలమయం అయ్యాయి. వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంజామల: మండలంలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురుసింది. దీంతో వాతవరణం చల్లబడింది. ఉదయం నుంచి ఉక్కపోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతుండగా సాయంత్రం ఒక్కసారిగా వాతవరణం చల్లబడింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడింది.

బేతంచెర్ల మండలంలో భారీ వర్షం

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకల్లు పొంగి పొర్లాయి. వారం రోజులు ఆడపదడపా వర్షాలతోపాటు నేడు భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు.

వర్షం కోసం ప్రకృతి మాత,ఋష్యశృంగ మహర్షి విగ్రహాల ప్రతిష్ట

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వకొండపై వెలసిన శ్రీహట్టిమునిస్వామి ఆశ్రమంలో శుక్రవారం వర్షం కోసం ప్రకృతి మాత ఋష్యశృంగ మహర్షి మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. విశ్వ హిందూ పరిషత్, ఆలయ కమిటీ, ధార్మిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పూర్వం నుంచి వర్షాలు కురవనప్పుడు విరాట్ పర్వాన్ని నియమబద్ధంగా పఠించినా, శ్రవణం చేసినా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ప్రజల్లో నమ్మకం ఉన్నట్లు తెలిపారు. ఈ విగ్రహాలతో పసుపల, పెద్దరాజుపాళెం, చిన్నరాజుపాళెం, క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు, జ్వాలాపురం, పాతపాడు, మీరాపురం, మాదసుపల్లె, సాదుకొట్టం, యాగంటిపల్లె బత్తులూరుపాడు, యనకండ్ల, గోర్లగుట్ట గోవిందిన్నె, యర్రగుడి, హుస్సేనాపురం గ్రామాల్లో రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 31న బనగానపల్లెకు చేరుకొని జూన్‌లో ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు


పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో వెలసిన వీర బ్రహ్మేంద్రస్వామివారి ఆరాధనోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మునీశ్వర స్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల విగ్రహాలకు పంచామృతాభిషేకం, పంచ బ్రహ్మ కలశ స్థాపన, నవగ్రహ పూజలు చేశారు. అదేవిధంగా మహామంగళ హారతి, నైవేద్యం తదితర పూజలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలు, వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పట్టణ పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రహదారిలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి 331వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈఓ బ్రహ్మానందరెడ్డి, నేలమఠం పీఠాధిపతి శ్రీనివాసాచార్యస్వామి ఆధ్వర్యంలో ఉదయం నాదస్వరం, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, శతమాన పూజలు, వీరకాళికాంబదేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. కొండపేట గరిమిరెడ్డి అచ్చమాంబ ఇంటి నుంచి స్వామివారి 331వ జీవసమాధి జ్ఞాపిక పతాకాన్ని నేల మఠం వరకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం మహాప్రసాదవితరణ, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. 19వ తేది వరకు ఆరాధనా మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ప్యాపిలి: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగరాజు ఆచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయాన్నే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పొంగిపొర్లిన ముచ్చట్ల వాగు... రాకపోకలకు అంతరాయం

బేతంచెర్ల: భారీ వర్షం కురువడంతో మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపాన ఉన్న ముచ్చట్లవాగు పొంగిపొర్లింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముచ్చట్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈర హదారి గుండా బేతంచెర్ల– డోన్ ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా, పక్కన ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేశారు. అయితే భారీ వర్షానికి రహదారి కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. డోన్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారులు, ఆటోలు, భారీ వాహనాలు ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి వెళ్లి గూటుపల్లె, హుసేనాపురం, తవిసి కొండ, బలపాల పల్లె గ్రామాల మీదుగా బేతంచెర్లకు చేరుకుంటున్నాయి. మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు సైతం చేసేదేమి లేక బేతంచెర్ల పట్టణం నుంచి అదే రహదారి వెంట రంగాపురం చేరుకొని ఆలయానికి వెళ్లారు.


బేతంచెర్ల పట్టణంలో కురుస్తున్న వర్షం


ముచ్చట్ల వాగులో భారీగా ప్రవహిస్తున్న వర్షపునీరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె : మండలంలోని పాతపాడు, పసుపల, బనగానపల్లెలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కోవెలకుంట్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామమోహన్ తెలిపారు. మూడవ శనివారం కావడంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల, దొర్నిపాడు సెక్షన్లకు సంబంధించి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంజామల: మండలంలోని నొస్సం, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. అక్కంపల్లె, నొస్సం, రామిరెడ్డిపల్లె, పేరుసోముల గ్రామాల ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినయోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


కూలిలతో మాట్లాడుతున్న ఏపీఓ శేషన్న

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయం 6గంటలకే పనులకు హాజరై 10 30 గంటలకు పూర్తి చేసుకోవాలని సూచించారు. రూ.300 వేతనం కోసం సూచించిన కొలతల ప్రకారం పని చేయాలన్నారు.

డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు


డీఎస్పీ షర్ఫుద్దీన్

కొలిమిగుండ్ల: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో అందరి సహకారంతో ప్రశాంతంగా జరిగాయని డీఎస్పీ షర్ఫుద్దీన్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటి, రెండు ప్రాంతాల్లో చిన్న గొడవలు మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలపై నిఘా ఉంచి ముందస్తు చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. సమస్యాత్మకమైన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సైతం ఎక్కడా గొడవలు లేకుండా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికల రోజు పెట్నికోటలో జరిగిన గొడవపై విచారణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గోరుకల్లు నుంచి నీటిసరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీటి సరఫరాను 48 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి శుక్రవారం తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ ఇంటెక్ వెల్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవా

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారికి పల్లకీ సేవా శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులుగావించి పల్లకీ సేవా నిర్వహించారు.

ముందస్తు అడ్మిషన్‌లను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రతాప్

డోన్ రూరల్ : ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నాయని, అధికారులు వెంటనే అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక నక్కిరామన్న భవనంలో శుక్రవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ డోన్ మండల సమితి ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఎన్నికల హడివిడిలో ఉండగా ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలు కలర్, కలర్ కరపత్రాలు తయారు చేయించి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయని ఆరోపించారు. ఆయా సంస్థల యాజమాన్యాలు ఉద్యోగులను సైతం తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని, అడ్మిషన్‌లు తీసుకొస్తేనే జీతాలు ఇస్తామంటూ హెచ్చరిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు మనోజ్, శశిధర్‌రెడ్డి, వంశీ, ఈశ్వర్, సిద్దార్థ్ , సురేంద్ర, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై సమీక్ష


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై చర్చించారు.